క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

ధారూరు: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నర్సింహులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమీక్షకు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, అధికారులు, గ్రామ ప్రత్యేక అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి


నాయకులతో అయూబ్ అన్సారీ

ధారూరు: మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ చైర్మన్ అయూబ్ అన్సారీ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధి నాగారం గ్రామాన్ని సందర్శించి, పలువురితో మాట్లాడారు. ముస్లిం కమిటీ హాల్ నిర్మాణం, మజీద్ తదితర సమస్యలను స్పీకర్ జి. ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు లాల్ మహ్మద్, గౌసొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సెల్ కన్వీనర్‌గా రమేశ్


రమేశ్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

మోమిన్‌పేట: బీజేపీ పార్లమెంటు లీగల్ సెల్ కన్వీనర్‌గా న్యాయవాది రమేశ్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నియామక పత్రం అందజేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆదివారం వికారాబాదులో పలువురు న్యాయవాదులు రమేశ్‌ను సన్మానించారు. వెల్‌చాల్ గ్రామానికి చెందిన రమేశ్.. గతంలో పార్టీ మండల అధ్యక్షుడిగా కొనసాగారు. ప్రస్తుతం లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమించడం పట్ల.. పార్టీ అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు.. పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్

పెద్దేముల్: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఆత్కూర్ మాజీ సర్పంచ్ ఆంజిలప్ప అన్నారు. ఆదివారం గ్రామంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ(ఎన్‌ఆర్‌ఈజీఎస్) నిధులు రూ.5లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ నిధులతో 125 మీటర్ల మేర రోడ్డు నిర్మించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాఘవేందర్, బ్రహ్మం, భీమని రాయుడు, సంగప్ప పాల్గొన్నారు.

నాణ్యత లోపంతోనే గుంతలు


గుంతలో దిగబడిన ఆటో

దోమ: సీసీరోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించడం వలనే భారీ గుంతలు ఏర్పడుతున్నాయని మండల ప్రజలు ఆరోపించారు. గోతుల్లో వాహనాలు దిగబడి వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ ఘటనల్లో పలువురుకి గాయాలు అయినట్లు వెల్లడించారు. తాజాగా ఆదివారం ఒక ఆటో దిగబడిందని తెలిపారు. గుంతల విషయం గ్రామపంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, సంబంధిత అధికారులు స్పందించి, గోతుల రోడ్డును మరమ్మతు చేయించాలని కోరారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


ప్రత్యేక పూజలు చేస్తున్న విశాల తదితరులు

కేశంపేట: మండల పరిధిలో కాకునూర్ గ్రామంలోని శ్రీమహాలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ, గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామి వారి కల్యాణం చేశారు. కాకునూర్ గ్రామస్తులతో పాటు కేశంపేట, బోధునంపల్లి, సుందరపురం, లేమామిడి, నిర్దవెల్లి గ్రామస్తులు హాజరయ్యారు. అనంతరం గ్రామంలో వాలీబాల్ పోటీలను తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి ప్రారంభించారు.

ఉల్లిసాగు.. భలేబాగు

- ఆశించిన స్థాయిలో దిగుబడి
- లభిస్తున్న మద్దతు ధర
- హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు


ఎన్కేపల్లిలో ఉల్లిపంట

మోమిన్‌పేట: ఉల్లిగడ్డకు మార్కెట్లో మద్దతు ధర పలుకుతుండటంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గతేడాది కంటే.. ప్రస్తుత కాలం కలిసొచ్చిందని తెలిపారు. మార్కెట్లో క్వింటాకు రూ.1600ల నుంచి రూ.1800ల వరకు ధర పలుకుతుండటంతో.. పెట్టుబడులు పోను ఆశించిన స్థాయిలో కాకపోయినా.. లాభాలు మెండుగానే ఉన్నాయని ఉల్లి రైతులు పేర్కొంటున్నారు.

వెయ్యి ఎకరాల్లో సాగు

దిగుబడితో పాటు, లాభాలు అధికంగా వస్తుండటంతో కూరగాయల రైతులు.. ఉల్లిసాగుకు మక్కువ చూపుతున్నారు. గత సంవత్సరం అకాల వర్షాలకు నష్టపోయినా.. ఈ సారి లాభాల పంట పండుతున్నట్లు పలువురు తెలిపారు. మండల పరిధి ఏన్కతల, కాస్లబాదు, రాళ్లగుడుపల్లి, మేకవనంపల్లి, చక్రంపల్లి, కోల్కుంద, అంరాధికలాన్, అంరాధికుర్దు, ఎన్కేపల్లి గ్రామాల్లో ఉల్లిని ఎక్కువగా సాగు చేస్తున్నారు. సుమారు 800ల నుంచి వెయ్యి ఎకరాల వరకు రబీలో సాగు చేస్తున్నారు.

సాంకేతికత పద్ధతులతో..

గతంలో రైతులు ఉల్లి నారును చిన్నచిన్న ఎత్తైన నారు మడులను తయారు చేసుకునే వారు. ఏవైనా చీడపీడలు ఆశించినా.. అవి పూర్తిగా కుళ్లిపోయేవి. కానీ నేడు సాంకేతికత పద్ధతులతో రెయిన్ డ్రిప్ ద్వారా నారు మడులను తయారు చేస్తున్నారు. తద్వారా పంటకు తెగులు సోకకుండా.. అరికట్ట వచ్చని రైతులు పేర్కొంటున్నారు. నారు కొన తెల్ల బారిన వెంటనే రెయిన్ డ్రిప్ ద్వారా నీటిని వదలడం వలన నారు మొత్తం తడిచి, ఎదిగేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందని తెలిపారు. అదే విధంగా నాటే సమయంలోనూ డ్రిప్ ద్వారానే సాగు చేస్తున్నట్లు చెప్పారు. తడులు ఇచ్చేందుకు కూలీల ఖర్చు తక్కువగా ఉండటంతో పాటు.. నీటిని కూడా పొదుపుగా వాడుకోవచ్చని రైతులు చెబుతున్నారు. ఈ విధానంలో.. ఎకరాకు 100 క్వింటాళ్లకు పైగానే దిగుబడి వస్తుందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పొలంలోనే దున్నేశా..

ఒక ఎకరాలో ఉల్లిని సాగు చేశాను. గత సంవత్సరం రెండు ఎకరాల్లో పండించగా.. పంట తీతకు వచ్చిన సమయంలో వడగళ్ల వర్షం కురిసి, పూర్తిగా కుళ్లిపోయింది. ఒక కిలో కూడా విక్రయించలేక పోయాను. పొలంలోనే దున్నేశా. అదే భయంతో ప్రస్తుతం ఎకరాలోనే సాగు చేశాను. ఆశించిన స్థాయిలో దిగుబడితో పాటు, మద్దతు ధర వస్తోంది.

– పట్లోళ్ల రాంచంద్రారెడ్డి, రైతు, ఎన్కేపల్లి

రోడ్డు పనుల టెండర్ పూర్తి

- అసంపూర్తి వంతెన పనులు నేడు ప్రారంభం
- ఏఈ శ్రావణ్‌కుమార్


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

ధారూరు: దోర్నాల్–స్టేషన్ ధారూరు గ్రామాల మధ్య ఉన్న కాగ్నానదిపై నిర్మిస్తున్న వంతెనకు ఇరువైపులా రోడ్డు పనుల కోసం రోడ్లు, భవనాల శాఖ టెండర్ ప్రక్రియ ప్రారంభించిందని, టెండర్ ఎవరికి దక్కుతుందో నేడు తేలనుందని తాండూరు ఆర్ అండ్‌బీ ఏఈ శ్రావణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అసంపూర్తి వంతెన పనులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని, వంతెనకు తాండూరు, ధారూరు వైపులా అప్రోచ్ బీటీరోడ్డు ఆన్‌లైన్‌లో టెండర్ లైవ్‌లో ఉందన్నారు. వంతెనకు ఇరువైపులా మట్టి పోసి, వంతెనపై స్లాబ్ నిర్మాణ పనులు సదరు కాంట్రాక్టర్ ప్రారంభిస్తారని ఆయన వెల్లడించారు. వంతెన పనులు పూర్తయి, రాకపోకలు ప్రారంభమైతే.. పరిగి, తాండూరు, యాలాల, పరిగి మండలాలతో పాటు మహబూబ్‌నగర్ జిల్లా రాకపోకలకు దూరభారం తగ్గనుందని పేర్కొన్నారు.

స్పీకర్‌ను కలిసిన నాయకులు

దోర్నాల్–స్టేషన్ ధారూరు మధ్య కాగ్నానదిపై నిర్మిస్తున్న వంతెన పనులు త్వరగా పూర్తిచేసి, వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు శంకర్ కోరారు. ఈ మేరకు ఆదివారం స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను పలువురు నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన స్పీకర్.. నాలుగు రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

పార్టీ అభివృద్ధికి పాటుపడండి

పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేశం

పెద్దేముల్: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని తట్టేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) డైరెక్టర్ ఉప్పరి మల్లేశం అన్నారు. అదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు శోభారాణి, తాండూరు వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, జిల్లా నాయకుడు మైపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ రియాజ్, కోటపల్లి వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్‌పర్సన్ బుజ్జమ్మ, పెద్దేముల్ ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీలు రమేష్‌కుమార్, విద్యాసాగర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు, ఆనందచారీ, జైపాల్‌రెడ్డి, మల్లప్ప, వెంకటరెడ్డి, బాల్‌రెడ్డి, మినాజ్, రామప్ప, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కాళికాదేవికి ప్రత్యేకపూజలు


విశేష అలంకరణలో అమ్మవారు

కుల్కచర్ల: అమావాస్యను పురస్కరించుకుని కాళికామాత దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి పౌర్ణమి, అమావాస్యలకు భక్తులు అమ్మవారికి పూజలు చేయడం అనవాయితగా వస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ఆర్టీసీకి పూర్వవైభవం తీసుకువస్తాం..

పరిగి డీఎం కరుణ శ్రీ


ఉద్యోగులకు స్వీట్లు పంచుతున్న డీఎం

పరిగి: ఆర్టీసీని లాభాల బాటలో తీసుకు వచ్చేందుకు ఉద్యోగులందరూ కృషి చేయాలని డీఎం కరుణశ్రీ సూచించారు. ప్రభుత్వం 2017 పేస్కేల్‌ను ప్రకటించినందుకు ఆదివారం సంస్థ ఉద్యోగులు సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడారు. పేస్కేల్‌ను 21శాతం ప్రకటించినందుకు.. సీఎం రేవంత్‌రెడ్డికి, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగులు మరింత ఉత్సాహంతో పనిచేస్తారని, నిత్యం విధినిర్వహణలో ఉంటూ.. సంస్థకు లాభాలు తెచ్చి, పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

ఉద్యోగులను అవమానించిన మాజీమంత్రి!

పీఆర్‌టీయూ వికారాబాద్ మండలం అధ్యక్షుడు బాబ్యా నాయక్

వికారాబాద్ అర్బన్: ఉద్యోగులను అవమానించేలా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడారని, ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పీఆర్‌టీయూ వికారాబాద్ మండలం అధ్యక్షుడు బాబ్యా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యోగులు ఏసీ గదుల్లో కూర్చుంటారని, వారికి ఎలాంటి కష్టం ఉండదని, తమ హయాంలో ముందుగా రైతులకు రైతుబంధు ఇచ్చిన తరువాతనే, ఉద్యోగులకు వేతనాలు ఇచ్చినట్లు హరీశ్ అనడం ఎంత వరకు సబబని వాపోయారు. ఇది తమను అవమానించినట్లుగా ఉందన్నారు. రైతుబంధు సకాలంలో ఇవ్వడాన్ని ఉపాధ్యాయులు స్వాగతించారని, 80శాతం మంది ఉద్యోగులు రైతు కుటుంబాల నుంచి వచ్చినవారేనని వెల్లడించారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో.. బ్యాంకుల్లో ఈఎంఐలు చెల్లించని పరిస్థితి నెలకొనేదని, తద్వారా అదనంగా వడ్డీలు చెల్లించాల్సి వచ్చిందని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు 1వ తేదీన వేతనాలు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఇదే సమయంలో రైతులకు సకాలంలో రైతుబంధు ఇవ్వాలని కోరారు.

పూలేను ఆదర్శంగా తీసుకోవాలి


సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి: మహిళలు, విద్యార్థినులు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు సూచించారు. పూలే వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా పూలే.. పనిచేశారని, ప్రత్యేకించి ఆడపిల్లలకు చదువు చెప్పి, వారిని విద్యావంతులను చేశారని గుర్తుచేశారు. అంతే కాకుండా.. అనగారిన వర్గాల అభ్యున్నతికి ఆమె పాటుపడ్డారని తెలిపారు.

కల్వర్టుకు కంచె నిర్మించండి

కొత్తూరు: మండల పరిధిలోని మల్లాపూర్ నుంచి గూడూరు గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో మల్లాపూర్ ఎస్సీ కాలనీ సమీపంలోని కల్వర్టు ప్రమాదాలకు నిలయంగా మారింది. దీనికి కంచె ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రమాదం బారిన పడక తప్పదని స్థానికులు వాపోయారు. ఇదే విషయం సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి.. కల్వర్టుకు రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రమాదకరంగా కల్వర్టు

ఐకమత్యంతో సమస్యలు పరిష్కారం

సెంట్రింగ్ యూనియన్ మండల అధ్యక్షుడు శంకర్


చిన్నమంగళారంలో నూతన కమిటీతో బుర్ర శంకర్ తదితరులు

మొయినాబాద్ రూరల్: సెంట్రింగ్ కార్మికులు ఐకమత్యంతో ఉంటేనే సమస్యలు పరిష్కరించొచ్చని సెంట్రింగ్ యూనియన్ మండల అధ్యక్షుడు శంకర్ పేర్కొన్నారు. ఆదివారం మొయినాబాద్ మండలంలోని సెంట్రింగ్ యూనియన్ అసోసియేషన్ మండల స్థాయి గుత్తెదారుల నూతన కమిటీ కార్యవర్గ సమావేశాన్ని ఓ ఫామ్‌హౌజ్‌లో నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మండల నూతన కార్యవర్గాన్ని నియమించారు. మండల సెంట్రింగ్ యూనియన్ అసోసియేషన్ గుత్తెదారుల నూతన అధ్యక్షుడిగా చిన్నమంగళారం బుర్ర శంకర్, గౌరవ అధ్యక్షుడిగా దర్శన్‌సాగర్, ప్రధాన కార్యదర్శి చింతల రవిసాగర్, కోశాధికారిగా చింతల మునకసాగర్, చింతల నవీన్‌సాగర్, ఉపాధ్యక్షుడిగా షాపురం రాంరెడ్డి, చిలుకూరు రమేశ్, లక్ష్మినారాయణ, జనరల్ సెక్రటరీగా సాగర్, అశోక్, యాదయ్య, చింతల నర్సింగ్‌సాగర్, సంఘం సభ్యులుగా ప్రభుసాగర్, రాజుసాగర్, సాయిరాంసాగర్, కాంతన్నసాగర్, రాజిరెడ్డి, ఎండి మౌలానా, ఎండి ఖాదర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుర్ర శంకర్ మాట్లాడుతూ కార్మికులు ఐకమత్యంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ యాదవ్


మాట్లాడుతున్న నర్సింహ యాదవ్

నందిగామ: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. నందిగామలో బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశాన్ని జంగ నర్సింహ యాదవ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ విజయంకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకూ తీసుకెళ్లాలన్నారు. ఈ విషయంలో ఓటర్లను చైతన్య పరచాల్సిన బాధ్యత ఏజెంట్లు తీసుకోవాలని చెప్పారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీ చంద్‌రెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల, బూత్ స్థాయి ఏజెంట్ల కో ఆర్డినేటర్ మంకాల శ్రీశైలం, పలు గ్రామాల ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప సభను జయప్రదం చేయండి

కొత్తూరు: హైదరాబాద్ ఎల్‌బీస్టేడియంలో మంగళవారం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బూత్ లెవల్ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్ కోరారు. కొత్తూరు పట్టణంలో ఆదివారం పట్టణ అధ్యక్షుడు నాగరాజు చారీ ఆధ్వర్యంలో నిర్వహించిన కొత్తూరు, నందిగామ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌బీస్టేడియంలో జరగనున్న బూత్, శక్తి కేంద్రాల నాయకులతో నిర్వహించే సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొని వారికి పార్లమెంట్ ఎన్నికలతో పాటు పలు అంశాలపై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అమ డపురం నర్సింహ్మగౌడ్, రమేశ్, శేఖర్‌గౌడ్, కుమార్, శివలింగం, అరవింద్, గణేశ్, మల్లేశ్, సందీప్‌సింగ్ ఉన్నారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం


ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

అ'పూర్వ'సమ్మేళనంలో ఉపాధ్యాయులు

దోమ: విద్యార్థి దశ అనేది మానవ జీవితంలో ఎంతో కీలకమైనదని ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, రవీందర్ గౌడ్, మల్లయ్యలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో 2002–03 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు.. పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ వేదికలో బాల్యమిత్రులు అందరూ ఏకమై.. సందడి చేశారు. నాటి చిలిపి చేష్టలను గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వ్యక్తి జీవితంలో చెరగని ముద్రవేసే తీపి జ్ఞాపకాలు ఒక్క విద్యార్థి దశలోనే ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాష్, శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, శ్రీనివాస్ గౌడ్, కె.ఎం. శ్రీనివాస్, విద్యార్థులు ఖాజ పాష, చంద్రబోస్, శ్రవణ్ కుమార్ రెడ్డి, రమేష్, భీమయ్య, రఫిక్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దోపోత్సవం

- జనసంద్రంగా మారిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం
- భక్తి భావంతో మోక్షం
- కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్


వేంకటేశ్వరస్వామి అలివేలు మంగమ్మలను ఆలయంలోకి తీసుకెళ్తున్న నిర్వాహకులు


స్వామి వారి ఊరేగింపు

చేవెళ్ల: శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రధాన ఘట్టమైన దోపోత్సవం శనివారం అర్ధరాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఆలయ సమీపంలోని పుష్కరిణి వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మను వేరువేరుగా ఆలయం నుంచి ప్రధాన కూడళ్ల ద్వారా ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. అక్కడ భక్తజనసందోహం మధ్య దోపోత్సవాన్ని నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి నుంచి చెంచులు ఆభరణాలు దొంగిలించి, అలివేలు మంగమ్మకు అందించే ఈ కార్యక్రమాన్ని చెంచులు ఆటపాటలతో నిర్వహించారు. దీన్ని వైభవంగా నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. డప్పుల చప్పుళ్లతో ఉత్సాహంగా కొనసాగింది. ఆభరణాలు దోచుకోవడం పూర్తయిన అనంతరం దేవతామూర్తులను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఈఓ నరేందర్, పూజారులు శ్రీపాదు, శ్రీకాంత్, వామానాచార్యులు, వాసు, కన్న, మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్, బండారి శైలజ ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, టేకులపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తి భావంతో మోక్షం లభిస్తుందన్నారు. దోపోత్సవం, చేవెళ్ల వేంకటేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవ కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జి భీంభరత్ పాల్గొన్నారు. ఆయన వెంట సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, యాదగిరి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తు..

దోపోత్సవ కార్యక్రమానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. ఉత్సవం నేపథ్యంలో నెలకొన్న ట్రాఫిక్‌ను పోలీసులు ఎప్పటికప్పుడు క్లియర్ చేశారు.

చేవెళ్ల జాతరలో అన్నదానం

హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ


పూజలో ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: శివరాత్రిని పురస్కరించుకొని జాతర పాల్గొన్న భక్తులకోసం మండల కేంద్రంలో ఆదివారం వేరువేరుగా దాతలు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. గుండం వద్ద అత్తెల్లి జగన్నాథ్ రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదానాన్ని సీఐ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్ కుమారుడు ఎం. యాదరగిరి.. ధర్మసత్రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. మరో చోట సెవెన్ హిల్స్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంను ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ భక్తుల ఆకలి తీర్చేందుకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు.

ప్రజాప్రతినిధుల పూజలు..

శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలు అన్నారు. ఆదివారం వారు వేరువేరుగా వచ్చి స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఇందులో కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్, డీవీఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.